క్లుప్తంగా

రుక్మిణిగూడ గ్రామ సందర్శన

సీతంపేట: మండలంలోని రుక్మిణిగూడ గ్రామాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వీడీవీకే కేంద్రాన్ని మంజూరు చేస్తామన్నారు. రహదారి, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: అయ్యప్పస్వామి మాలధారణ వేసిన భక్తులకు శుక్రవారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నప్రసాద వితరణ చేశారు. సన్నిధానం వద్ద జరిగిన అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు శిక్షణ

సీతంపేట: స్థానిక వైటీసీలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ గీతాంజలి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

గరుగుబిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా వై.అమ్మన్నరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బత్తిలి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ రాజేష్ సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బందితో సమన్వయం చేసుకొని బాధ్యతలను నిర్వర్తిస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ తెలిపారు.

యాగం ఆరంభం



సుబ్రహ్మణ్య యాగంలో వేద పండితులు, భక్తులు

భామిని: మండలంలోని ఘనసర శ్రీ మధన కామేశ్వరుని సన్నిధిలో శుక్రవారం శ్రీ వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామియాగం ఆరంభమైంది. గ్రామ అర్చకులు గుడిమెట్ల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో బత్తిలి పురోహితులు రంపా లలిత ప్రసాదశర్మ సారథ్యంలో వేద పండితులు యాగంలో అగ్ని ప్రతిష్టాపన చేసి ఆరంభించారు. మహాన్యాస పూర్వక సహస్ర లింగార్చన గావించారు. దంపతులు పూజలు చేశారు. యాగం ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని మండల ధార్మిక మండల కన్వీనర్ ఎరుకుమజ్జి అప్పలనాయుడు తెలిపారు.

18, 19 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: ఎస్‌ఎఫ్‌ఐ 31వ పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు ఈ నెల 18, 19 తేదీల్లో పాలకొండ పట్టణంలో జరగనున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గంగారావు వెల్లడించారు. కురుపాంలో జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంఘం ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ 31వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బి.రమేష్, విద్యార్థులు సోమేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏఓ జ్యోత్స్న

జియ్యమ్మవలస: వెలుగు కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఇన్‌చార్జి ఏఓ జ్యోత్స్న ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు తాడేల మన్మథనాయుడు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరగా రైతులకు సరిపడ గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు



పాలకొండ రూరల్: నవగాంలో ప్రజలకు వైఎస్సార్ సీపీ చేపట్టిన సంక్షేమం వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



గుమ్మలక్ష్మీపురం: దుడ్డుఖల్లులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు



కొమరాడ: కుంతేసులో డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతంపేట: టిటుకుపాయిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ తదితరులు

రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ముడిపడి ఉందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం పలుచోట్ల జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు వివరించాయి. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

పశు వ్యాధులపై తస్మాత్..



వల్లాడలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం: పాడి రైతులంతా పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి పి.లక్ష్మణరావు అన్నారు. మండ లంలోని వల్లాడ గ్రామంలో జట్టు సంస్థ, జీవ ప్రాజె క్ట్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత పశువైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పొదుగు వాపు వ్యాధి, మేకలకు, గొర్రెలకు న్యూమోనియా, చర్మ వ్యాధులు, కోళ్లకు మూతిపుండ్ల వ్యాధులు రాకుండా తగిన వ్యాక్సిన్లు, మందులను వేశారు. రైతులంతా పశువుల పెంపకంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్న నేపథ్యంలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలంటూ వైద్యాధికారితో పాటు జీవ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.ప్రభోధ్ సూచనలు చేశారు. జట్టు కో ఆర్డినేటర్ జి.మురళిమోహన్, సీఆర్‌పీ కె.దేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండాలి



వీరఘట్టం: వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల జాబితాలు తప్పులు లేకుండా పక్కాగా ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. స్థానిక కార్యాలయంలో వీఆర్‌ఓలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండుతున్న ప్రతీ ఒక్కరినీ ఓటర్లుగా చేర్పించేలా వీఆర్‌ఓలు చొరవ చూపాలన్నారు. అవసరమైతే సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి యువత వివరాలు ఆరా తీసి అర్హత ఉన్న అందరికీ ఓటు హక్కు కల్పించేలా చొరవ చూపాలని కోరారు.

ఓటర్ల జాబితాల పరిశీలన

భామిని: ఓటర్ల జాబితాల పరిశీలన పక్కాగా జరుగుతుంది. మండలంలోని నేరడి బీ సచివాలయంలో మండల పరిశీలకుడు, ఉపాధి ఏపీఓ తులసీదాస్ ఆధ్వర్యంలో రెండు వర్గాలతో చర్చించి ఓటర్ల జాబితాల్లో తొలగింపునకు సంబంధించి బీఎల్‌ఓ ప్రదీప్‌కుమార్‌కు సూచనలు చేశారు. కార్యదర్శి ఎల్.అనసూయ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా..

భామిని మండలంలో అన్ని పోలింగ్ బూతులలో ఓటర్ల జాబితాలు సవరణ పేరున ఓటర్ల పేర్లు తొలగింపులు జరిగే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ శుక్రవారం హెచ్చరించారు. పార్టీ కన్వీనర్లు, గృహసారథులు ఓటర్లు జాబితాల పరిశీలనలో పాల్గొని సక్రమంగా సాగేటట్లు చూడాలని కోరారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పాలకొండ: ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ భూ హక్కుల చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కోర్టు ఆవరణలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మురళీ మోహనరావు మాట్లాడుతూ న్యాయ పరిధిలో లేకుండా రాజకీయ జోక్యం ఎక్కువగా ఉన్న ఈ చట్టం రద్దు చేయాలని కోరారు. ఈ చట్టంతో ప్రజలకు నష్టం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొర్ల సత్యంనాయుడు, బలగ నరసింహరావు, సీమల కృష్ణారావు, బత్తిన మోహనరావు, సంగంన్నాయుడు, కర్రా రవి, బి రామ్మోహనరావు, ఎం.వెంకటేశ్వరరావు, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం కొనుగోలు

వీరఘట్టం: ఖరీఫ్ ధాన్యం పక్కాగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారీల బెడద లేకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడైనా పంట తడిస్తే రైతులకు తగు సలహాలు, సూచనలిచ్చి పంటలు కాపాడేలా వ్యవసాయ శాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఏఓ జె.సౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి అమరేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, వారాడ శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని డీఎల్‌పీఓ ఎం.నాగభూషణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



బీజేపురంలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించే సంకల్పంతో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని, వినూత్నమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ ఆదేశాలను, నియమాలను అందరూ తప్పకుండా అనుసరించాలని, సేవల్లో పారదర్శకత పాటించి ప్రజలకు సకాలంలో పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల ఫొటో గ్యాలరీని పరిశీలించారు. జగనన్న పాటలకు గ్రామస్తులు ఆడిన కోలాటం ఆకర్షణగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శోభాయాత్రకు ఎమ్మెల్సీకు ఆహ్వానం



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పాలకొండ రూరల్: హిందూ ధార్మిక సమ్మేళన శోభాయాత్ర ఈ నెల 10న టీటీడీ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొండలో జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు ఆహ్వాన పత్రిక సంస్థ సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ డి.యోగీశ్వరరావు కోరారు. పట్టణ పరిధిలో పలువురు ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక వక్తలకు ఆహ్వాన పత్రికలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ బోను చిన్నమ్మలు, సహాయ కన్వీనర్ రెడ్డి కేశవరావు, జానకీ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం కావాలి



వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 15 నుంచి తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నియోజకవర్గ క్రీడా పరిశీలకుడు వి.పుష్పనాథం అన్నారు. పెద్దకాపు వీధి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నగర పంచాయతీ పరిధిలోని తొమ్మిది సచివాలయాల ద్వారా సేవలు అందిస్తున్న వలంటీర్లకు క్రీడల నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మండల క్రీడా పరిశీలకుడు రాకోటి రాములు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలపై శిక్షణ ఇచ్చారు. నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, హెచ్ఎం సోమేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గణనాథ, దాలినాయుడు తదితరులు వలంటీర్లకు ఇచ్చిన శిక్షణను పర్యవేక్షించారు.

300 లీటర్ల సారా స్వాధీనం



జియ్యమ్మవలస: పట్టుకున్న సారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సారా స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ముందస్తు సమాచారం రావడంతో చినమేరంగి పోలీసులతో కలిసి దాడిచేసినట్లు ఎస్ఈబీ కురుపాం ఎస్సై బీవీ నాగభూషణరావు తెలిపారు.ఈ దాడులలో ఇద్దరు వ్యక్తుల నుంచి 300 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్సై జె.రాజశేఖర్, ఎం.రవిప్రసాద్, చినమేరంగి పోలీసులు పాల్గొన్నారు.

భక్తులను ఆకర్షించేలా ఆలయ నిర్మాణాలు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, చిత్రంలో శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

● ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: భక్తులను ఆకర్షించేలా తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రాకార మండప నిర్మాణం, అర్చకుల వసతిగృహాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ధర్మకర్తల మండలి, దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయంలో పలు నిర్మాణాలు చేపట్టడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. తోటపల్లి ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ తరఫున నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఆలయానికి పూర్వ వైభవం వచ్చేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. తొలుత ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులను పూర్ణ కలశంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు డి.ధనుంజయనాయుడు, డి.పారినాయుడు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమనోహర్, ఎంపీడీఓ తదితరులు

పాలకొండ రూరల్: గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అర్హత గల ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా గుర్తించాలని పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ కృష్ణమనోహర్ స్పష్టం చేశారు. మండలంలోని 22 సచివాలయాలకు చెందిన నాలుగు వందల మంది సచివాలయ సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ దొంక త్రినాధులు నేతృత్వంలో మండల పరిషత్ కార్యాలయంలో ఈ శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా మండల పరిధిలో వివిధ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు, అర్జీలు చేసుకున్న అర్హుల వివరాలపై సమీక్ష చేపట్టారు. అర్హుల గుర్తింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సకాలంలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాల సిలబస్ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి సూచించారు. మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి చదువులు పరిశీలించారు. సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ఇవ్వాలి



రొబ్బా లోవరాజు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఆశక్తి కనబరిచే గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా శిక్షణ ఇప్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు కోరారు. శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పట్టణ ప్రాంతాల్లో మాదిరిగా కోచింగ్ సెంటర్లు లేకపోవడం బాధకరమైన విషయమన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఐటీడీఏల ద్వారా గిరిజన విద్యార్థులకు ఉచితంగా గ్రూప్ 2 పరీక్షల కోసం సిద్ధపడేలా శిక్షణ ఇప్పించాలని, అంతే కాకుండా అన్ని గ్రామ సచివాలయాల వద్ద సంబంధిత మెటీరియల్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తే గిరిజన అభ్యర్థులకు మేలు చేకూరుతుందని లోవరాజు అన్నారు.

త్రోబాల్ గేమ్స్‌కు కొత్తగూడ విద్యార్థి



విద్యార్థి శ్యాంసుందర్‌తో పీడీ మాధవరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు)లో 9వ తరగతి చదువుతున్న మండంగి శ్యాంసుందర్ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు వెళ్తున్నట్టు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల మాధవరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవంబర్ 21న నెల్లిమర్లలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్ 14 విభాగంలో త్రోబాల్ క్రీడలో పాల్గొన్న శ్యాంసుందర్ ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నంద్యాలలోని కేఎస్ఎం ఎంపీఎల్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు పయనమవుతున్నట్టు పేర్కొన్నారు. శ్యాంసుందర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని హెచ్ఎం నాగరాజుతో పాటు డిప్యూటీ వార్డెన్ టి.గంగారావు ఆకాంక్షించారు.

స్వయం ఉపాధి మెరుగుపర్చుకోవాలి : పీడీ



మొబైల్ సేల్స్ అండ్ సర్వీసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్

గుమ్మలక్ష్మీపురం: పీఎంఈజీపీ ద్వారా పొందిన రుణంతో స్వయం ఉపాధి మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన సాయిబాబా మహిళ సంఘం సభ్యురాలైన సుగ్గు పార్వతికి పీఎంఈజీపీ ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ.4 లక్షలు మంజూరు కాగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పింది. మద్ది గీతకు మంజూరైన 35 శాతం సబ్సిడీపై రూ.16 లక్షలు రుణం మంజూరు కాగా మొబైల్ సేల్స్, స్పేర్స్ అండ్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు ఈ రెండు యూనిట్లను శుక్రవారం పీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ యూనిట్లను సక్రమంగా నిర్వహిస్తూ జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని సూచనలు చేశారు. ఆయన వెంట వైకేపీ ఏపీఎం ఆదయ్య, సీసీ పైడా నాగేశ్వరరావు తదితరులున్నారు.